
సాక్షి అనంతపురం

మంగళవారం । 26 । మార్చి । 2024



చీనీ టన్ను రూ.25 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.25 వేలు పలికాయి.



టమాట కిలో రూ.12

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.12 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

మంగళవారం	బుధవారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.33	సెహరీ : 5.02



న్యూస్‌రీల్

విదేశీ మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న పోలీసులు

అనంతపురం: నగరంలోని హమాలీ కాలనీలో పెద్ద సంఖ్యలో విదేశీ మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రెండో పట్టణ సీఐ కాంత్రి కుమార్ తెలిపిన మేరకు... అనంతపురంలోని హమాలీ కాలనీలో నివాసముంటున్న హనుమంతరెడ్డి కుమారుడు భరత్ రెడ్డి.. మాజీ సైనికోద్యోగుల కార్డులు సేకరించి బెంగళూరులోని ఆర్మీ క్యాంటీన్‌లో మద్యం బాటిళ్లు కొనుగోలు చేసుకొచ్చి అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. ఈ క్రమంలోనే ఇటీవల ఆర్మీ మద్యం బాటిళ్లతో పాటు విదేశీ మద్యాన్ని సైతం కొనుగోలు చేసి తీసుకొచ్చాడు. పక్కా సమాచారం అందుకున్న పోలీసులు.. డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి నేతృత్వంలో బృందాలుగా విడిపోయి సోమవారం ఉదయం హమాలీ కాలనీలో తనిఖీలు చేపట్టారు. ఓ అపార్ట్‌మెంట్‌లో దాచిన 39 మద్యం బాటిళ్లు గుర్తించి స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు. తనిఖీల్లో రుష్యేంద్ర బాబు, సలామ్ ఖాన్ పాల్గొన్నారు.

కదిరిలో ఇఫ్తారు విందుకు సీఎం జగన్



సీఎం పర్యటనపై మక్బూల్‌తో చర్చిస్తున్న తలశిల రఘురాం

కదిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరలో కదిరికి రానున్నారు. రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం మైనార్టీల కోసం ఏర్పాటు చేయనున్న ఇఫ్తారు విందులో సీఎం పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించిన వేదికను పరిశీలించేందుకు ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం సోమవారం కదిరికి విచ్చేశారు. వైఎస్సార్ సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్‌తో కలిసి కదిరి-మదనపల్లి రోడ్‌లోని పీవీఆర్ ఫంక్షన్ హాలును పరిశీలించారు. ఏప్రిల్ 1న సీఎం పర్యటన ఉండవచ్చని మక్బూల్ తెలిపారు.

హోలీ.. ఆనంద కేళీ

- జిల్లావ్యాప్తంగా అంబరాన్నంటిన సంబరాలు
- రంగులు చల్లుకుంటూ సందడి చేసిన చిన్నాపెద్ద



రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతున్న యువత



చిన్నారుల ఉత్సాహం



హోలీ శుభాకాంక్షలు చెబుతున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: జిల్లావ్యాప్తంగా సోమవారం హోలీ వేడుకలు ఆనందోత్సాహాల నడుమ జరిగాయి. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా రంగుల నీళ్ల చల్లుకుంటూ ఖుషీఖుషీగా గడిపారు. అనంతపురం నగరంలో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. పాతూరులో మరాఠీలు, జైనులు, రాజస్థానీలు సందడి చేశారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంతోష సాగరంలో మునిగితేలారు. ఈ సందర్భంగా పలు జైన మందిరాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. మానవ జీవితం సైతం నిత్యం రంగుల హరివిల్లులా ఆనందాలతో నిండాలన్న ఉద్దేశంతో హోలీ జరుపుకుంటారని జైనమత పెద్దలు తెలిపారు. ఈశ్వరీయ బ్రహ్మకుమారీలు హోలీ శుభసందేశాన్ని వినిపించి స్వీట్లు పంచిపెట్టారు.

లెక్కలపై పక్కా నిఘా

- సూక్ష్మ స్థాయిలో ఎన్నికల ప్రచార వ్యయం పరిశీలన
- తాగునీరు మొదలు ప్రతిఖర్చూ లెక్కలోకి
- పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కమిటీలు
- 18 వీడియో సర్వేలెన్స్ బృందాలు
- 9 అకౌంటింగ్ కమిటీలు, 9 ఏఈఓలు

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో నగదు చలామణి అధికంగా ఉంటుందని భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) భావిస్తోంది. ఈ నేపథ్యంలో పార్టీలు, అభ్యర్థులకు సంబంధించి ఎన్నికల ఖర్చుపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించింది. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు చేపట్టే ఎన్నికల ప్రచార వ్యయంపై జిల్లా ఎన్నికల యంత్రాంగం సూక్ష్మ నిఘా ఉంచనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా 18 వీడియో సర్వైలెన్స్ బృందాలు (వీఎస్‌టీ), 9 అకౌంటింగ్ కమిటీలు, 9 మంది అసిస్టెంట్ ఎక్స్‌పెండేచర్ అధికారులను (ఏఈఓ) ఏర్పాటు చేసింది. సభలు, సమావేశాలు, ప్రచారంలో వినియోగించే సామగ్రి మాత్రమే కాదు.. తాగునీరు, ఆహార పదార్థాలు వరకూ ప్రతి ఖర్చు లెక్కగట్టి అభ్యర్థుల ఎన్నికల వ్యయం కింద నమోదు చేస్తారు.



పరిశీలనకు ప్రత్యేక బృందాలు

రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఎన్నికల ప్రచారాన్ని పరిశీలించేందుకు వీడియో సర్వైలెన్స్ బృందాలను (వీఎస్‌టీ) నియమించారు. రాప్తాడు, గుంతకల్లు నియోజకవర్గాలకు మూడు చొప్పున, రాయదుర్గం, ఉరవకొండ, శింగనమల, అనంతపురం, తాడిపత్రి, కళ్యాణదుర్గం నియోజకవర్గాలకు ఒకటి చొప్పున మొత్తం 18 వీడియో సర్వైలెన్స్ బృందాలను ఏర్పాటు చేశారు. ప్రధాన రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిర్వహించే బహిరంగ సభలు, ప్రచారాన్ని ఈ బృందాలు చిత్రీకరిస్తాయి. ప్రసంగాలతో పాటు సభలు, ప్రచారంలో వినియోగించే సామగ్రి, వాహనాలు, ఆహార పదార్థాలు, తదితర వాటిని చిత్రీకరించి ఎక్స్‌పెండేచర్ కమిటీకి సీడీ రూపంలో అందజేస్తారు.

వీటికి లెక్క గడతారు

ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు వినియోగించే వస్తువులకు విలువ కడతారు. సభల సందర్భంగా వచ్చిన ప్రజలకు అందించే తాగునీటి ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు, ఇతరత్ర శీతలపానీయాలు, ఆహార పదార్థాలను, సభలో వినియోగించే షామియానా, కుర్చీలు, మైక్ సిస్టం, జెండాలు, స్టేజ్ అలంకరణ, వాడిన వస్తువులు, ప్రజలను తరలించేందుకు వినియోగించిన వాహనాలు తదితర వాటికి సంబంధించిన ఖర్చును లెక్కగడతారు. ఆ మొత్తాన్ని అభ్యర్థి ఎన్నికల వ్యయం కింద నమోదు చేస్తారు.

అంచనా వేసేందుకు ఏఈఓలు

అభ్యర్థుల ఎన్నికల వ్యయం పరిశీలించేందుకు పార్లమెంట్ నియోజకవర్గానికి ఒకటి, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున మొత్తం 9 అకౌంటింగ్ (పద్దు) కమిటీలు పనిచేస్తాయి. వాటికి తోడుగా 9 మంది అసిస్టెంట్ ఎక్స్‌పెండేచర్ అధికారులు (ఏఈఓ) ఉంటారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రచారం నిర్వహణకు అయిన ఖర్చు దేనికి ఎంత వెచ్చించారు అనేది అంశాల వారీగా కచ్చితంగా చూపాల్సి ఉంటుంది. అధికారులు అప్పటికే సేకరించిన వివరాలకు, అభ్యర్థులు చూపిన ఖర్చు సమానంగా ఉంటే ఆమోదిస్తారు. లేనిపక్షంలో అభ్యర్థుల వ్యయం పద్దులో నమోదు చేస్తారు.

అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలి

ఎన్నికల ప్రచారం నిర్వహించే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు తమ ప్రచార వ్యయం విషయంలో అప్రమత్తంగా ఉండాలి. లెక్కల్లో వ్యత్యాసం చూపిస్తే... అధికారులు తమ వద్ద అప్పటికే సేకరించి ఉంచుకున్న ఖర్చుల వివరాలను అభ్యర్థుల వ్యయం పద్దులో నమోదు చేస్తారు. కాబట్టి అభ్యర్థులు తమ ఎన్నికల వ్యయం విషయంలో జాగ్రత్తగా పద్దులు తయారు చేసుకుని అకౌంటింగ్ కమిటీకి సమర్పించాలి.

టీడీపీ చీప్ పాలి‘ట్రిక్స్’

- ఆగని చంద్రబాబు కుయుక్తులు
- సూపర్‌సిక్స్ పథకాలు కావాలంటే ఫొటోలు దిగాలంటూ పట్టు
- జనసమూహాల్లో చొరబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా దుష్ప్రచారం
- ఛీదరించుకుంటున్న ప్రజలు

రాయదుర్గం: ఈ ఎన్నికల్లోనూ ఓటమి తప్పదని తెలిసిన టీడీపీ చీప్ పాలి‘ట్రిక్స్’కు తెరతీసింది. సీఎం జగన్‌ను రాజకీయంగా ఎదుర్కొనే సత్తాలేక దుశ్చర్యలకు పాల్పడుతోంది. సీఎం పీఠం కోసం ఏ అవకాశాన్నీ వదులుకోని చంద్రబాబు.. ఇప్పటికే ఎల్లో మీడియా ద్వారా విస్తృతంగా అబద్ధాలు ప్రచారం చేయిస్తున్నారు. అయితే, ఎల్లో మీడియా దుష్ప్రచారం పనిచేయడం లేదని నిర్ధారించుకున్న ఆయన.. కొత్త విన్యాసాలు ప్రారంభించారు.

ఫొటో దిగితేనే పథకాలట..

అధికారం కోసం హామీలు ఇవ్వడం.. ఆ తర్వాత వాటిని తుంగలో తొక్కడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. గత ఎన్నికల్లోనూ 650 హామీలిచ్చిన ఆయన.. అధికారం చేపట్టాక ఒక్కటీ నెరవేర్చక అందరికీ కుచ్చుటోపీ పెట్టారు. అయితే, మళ్లీ ఎన్నికలు రావడంతో ప్రజలను మరోసారి వంచించేందుకు ‘సూపర్‌సిక్స్’ పథకాలు అంటూ నాటకాలు ప్రారంభించారు. ఈ క్రమంలోనే వీటిపై ప్రచారం కోసమంటూ ప్రత్యేక టీమ్‌లను రంగంలోకి దింపారు. జిల్లాలోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్తున్న ఈ టీమలు.. పథకాలకు సంబంధించిన పేపర్ చేతిలో పెట్టి ఫొటో దిగాలంటూ బతిమాలుతున్నారు. తాము తీసే ఫొటో నేరుగా చంద్రబాబుకు చేరుతుందని, ఇప్పుడు ఫొటో తీసుకుంటేనే భవిష్యత్తులో పథకాలు అందుతాయంటూ మభ్య పెడుతున్నారు.

గుంపులుగా వెళ్తూ..

వీరికి తోడు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడానికి మరికొన్ని బృందాలను కూడా చంద్రబాబు బరిలోకి దింపినట్లు తెలిసింది. గ్రామాలు, పట్టణాల్లో జన సమూహాల్లోకి చొరబడడం, ప్రభుత్వం, సీఎం జగన్‌పై వ్యతిరేకంగా మాట్లాడడమే వీరి పని. అయితే, టీడీపీ కుట్రలను గుర్తించిన ప్రజలు పలు చోట్ల ఈ పెయిడ్ గుంపులపై తిరగబడుతున్నట్లు తెలిసింది. చంద్రబాబు మాటలు నమ్మి మళ్లీ మోసపోయేందుకు తామేం పిచ్చోళ్లు కాదని స్పష్టం చేసినట్లు సమాచారం. ఏది ఏమైనా ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ టీడీపీ కొత్త కొత్త కుట్రలకు తెరలేపుతుండడంపై రాజకీయ విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

శేషవాహనంపై ప్రహ్లాద వరదుడు



శేషవాహనంపై లక్ష్మీ నారసింహుడు



ఆలయంలో దర్శనం కోసం కిక్కిరిసిన భక్తులు

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు శేష వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు.అంతకుముందు స్వర్ణ, వజ్ర, వైఢూర్య, మరకత, పట్టు పీతాంబరాల విశేషాలంకరణలో ఉన్న ఖాద్రీశుడు రాత్రి 9 గంటల ప్రాంతంలో శేషవాహనంపై కొలువుదీరారు. తర్వాత ఆలయం ముందు విద్యుత్ దీపాలంకరణ పూర్తి కాగానే తిరువీధుల్లో ఊరేగారు. స్వామివారి దివ్య రూపాన్ని భక్తులు దర్శించుకొని తన్మయత్వం చెందారు. శేష వాహనంపై ఉన్న స్వామి వారిని దర్శించుకుంటే నాగదోషం తొలగిపోతుందని భక్తుల విశ్వాసం. లక్ష్మీ నారసింహునికి సేవ చేయడానికి సాక్షాత్తూ ఆదిశేషుడే వాహనంగా విచ్చేశారని పండితులు వివరించారు. కదిరి పౌర్ణమి కావడంతో రోజంతా ఆలయంలో భక్తుల రద్దీ తగ్గలేదు. శేష వాహన ఉభయదారులుగా యాదాలం శ్రీనివాసులు, బాలాజీ కుటుంబ సభ్యులు వ్యవహరించారని ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కాగా, ఉత్సవాల్లో భాగంగా నారసింహుడు మంగళవారం పగలు సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

అయ్యో ‘పాప’ం

రాయదుర్గంటౌన్: పుట్టి నాలుగైదు రోజులు కూడా గడవకనే పసికందును రోడ్డుపై పడేసిన ఉదంతం రాయదుర్గం పట్టణంలో సోమవారం సాయంత్రం వెలుగుచూసింది. పట్టణంలో లక్ష్మీబజార్‌లోని ప్రధాన రహదారి పక్కన ఉన్న ముదుగులమ్మ గుడి వద్ద పసికందు ఏడుస్తూ ఉండడాన్ని అటు వైపు వెళ్లిన శాంతి అనే మహిళ గుర్తించారు. వెంటనే పాపను అక్కడికి సమీపంలో ఉన్న స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి అప్పగించారు. వైద్యాధికారి మాధవి బిడ్డకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యంగా ఉన్నట్లు చెప్పారు. ఐసీడీఎస్ అధికారులు, పోలీసులకు సమాచారం అందజేశారు. అనంతపురంలోని శిశు సంక్షేమ గృహానికి పసికందును తరలించనున్నట్లు అధికారులు తెలిపారు.



గుడిపక్కన దొరికిన పసికందు

ఖరీఫ్‌కు కావాల్సినంత ఎరువు!

- సిద్ధంగా 40 వేల మెట్రిక్ టన్నులు
- రైతులకు ఇబ్బంది లేకుండా జిల్లా అంతటా ముందస్తు నిల్వలు

అనంతపురం అగ్రికల్చర్: జూన్ నుంచి ప్రారంభం కానున్న ఖరీఫ్‌లో ఎరువుల కోసం రైతులు ఇబ్బంది పడకుండా జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది.వ్యవసాయశాఖ,మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జిల్లా అంతటా అటు ఆర్‌బీకేలు, సొసైటీలు, ఇటు ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లు, కంపెనీ గోదాముల్లో ఎరువులను అందుబాటులో ఉంచుతోంది. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్‌లతో పాటు పొటాష్, సూపర్ లాంటి కంపెనీలకు చెందిన అన్ని రకాల ఎరువులను నిల్వ చేస్తున్నారు. గత ఏడాది వర్షాభావంతో పంటల సాగు తగ్గినందున ఆ మేరకు ఎరువుల వాడకం కూడా తగ్గడంతో వాటిని ఖరీఫ్‌కు సర్దుబాటు చేయనున్నారు.

40 వేల మెట్రిక్ టన్నులు..

ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 40 వేల మెట్రిక్ టన్నులు ఎరువులు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. అలాగే ఏప్రిల్, మే నెలకు సంబంధించి కోటా కూడా వివిధ కంపెనీల నుంచి సరఫరా అయ్యే అవకాశం ఉంది. దీంతో ఖరీఫ్ మొదలయ్యే నాటికి 50 వేల మెట్రిక్ టన్నులు ఎరువులు అందుబాటులో ఉంటాయని అంచనా వేస్తున్నారు. వివిధ కంపెనీల ద్వారా సరఫరా అవుతున్న ఎరువులను మార్క్‌ఫెడ్, వ్యవసాయశాఖ ద్వారా ఆర్‌బీకేలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లకు ప్రాధాన్యత ఇస్తూనే ఇండెంట్ ప్రకారం హోల్‌సేల్, రీటైల్ డీలర్లకు సరఫరా చేస్తున్నారు. అత్యవసరం కోసం కంపెనీ గోదాములు, మార్క్‌ఫెడ్ దగ్గర బఫర్‌స్టాక్ పెడుతున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం 40 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉండగా అందులో అత్యధికంగా కాంప్లెక్స్ ఎరువులు 20 వేల మెట్రిక్ టన్నులు, యూరియా 13 వేల మెట్రిక్ టన్నులు, డీఏపీ 4,200 మెట్రిక్ టన్నులు, పొటాష్ 3 వేల మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 1,100 మెట్రిక్ టన్నులు, కంపోస్టు ఎరువులు 80 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. అందులో ఆర్‌బీకే హబ్‌ల పరిధిలో 2 వేల మెట్రిక్ టన్నులు, పీఏసీఎస్‌ల దగ్గర 270 మెట్రిక్ టన్నులు, రీటైల్ దుకాణాల్లో 24 వేల మెట్రిక్ టన్నులు, హోల్‌సేల్ డీలర్ల దగ్గర 3,700 మెట్రిక్ టన్నులు, మార్క్‌ఫెడ్ దగ్గర బఫర్‌స్టాక్ కింద 800 మెట్రిక్ టన్నులు, కంపెనీ గోదాముల్లో 11 వేల మెట్రిక్ టన్నుల వరకూ అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.



గోవిందా.. గోవింద

- కనులపండువగా చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం
- రథోత్సవానికి పోటెత్తిన భక్తజనం





రథోత్సవంలో పాల్గొన్న భక్తజన సందోహం (ఇన్‌సెట్) భూదేవి, శ్రీదేవి సమేత చెన్నకేశవస్వామి



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

యాడికి: మండల కేంద్రంలో సోమవారం గోవింద నామస్మరణ మార్మోగింది. శివలక్ష్మి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా భూదేవి, శ్రీదేవి సమేత శివలక్ష్మి చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం కనులపండువగా సాగింది. ఆలయ ప్రధాన అర్చకులు హరికృష్ణ శర్మ, జనార్దన శర్మ శాస్త్రోక్తంగా ఉత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హాజరై మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. శివలక్ష్మి చెన్నకేశవస్వామి కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. టెంకాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రమణీయం.. రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా చెన్నకేశవస్వామి రథోత్సవం రమణీయంగా సాగింది. సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఉత్సవమూర్తులను పల్లకీలో రథం వద్దకు తీసుకు వచ్చారు. ప్రదక్షిణల అనంతరం రథంలో ఆసీనులు చేసి ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు గోవిందా..గోవింద నామస్మరణతో మార్మోగించారు. రథోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జయవరం చంద్రశేఖర్, గాదం శెట్టి బలరామయ్య ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కృష్ణదేవరాయల బలిజ సంఘం సభ్యులు పానకం పంపిణీ చేశారు. ఉత్సవంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ గంగయ్య, యాడికి సీఐ నాగార్జున రెడ్డి, పెద్దపప్పూరు,పెద్దవడుగూరు ఎస్ఐలు బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామి రెడ్డి, సర్పంచు అనూరాధ, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బాలా రమేష్ బాబు, మాజీ సర్పంచు రమేష్ బాబు, ఆలయ ఈఓ దుర్గా ప్రసాద్, ఆలయ ధర్మకర్త రామిరెడ్డి, ఎంపీటీసీలు వెంకట నాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి పాదాలు తాకిన సూర్యకిరణాలు



లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్ పాదాలను తాకిన సూర్యకిరణాలు

గుత్తి: స్థానిక కోటలో వెలసిన పురాతన లక్ష్మీనరసింహ ఆలయంలో మూలవిరాట్ పాదాలను సూర్యకిరణాలు తాకాయి. ఏటా ఫాల్గుణ మాసంలో వచ్చే పౌర్ణమి నాడు ఈ అద్భుతం చోటు చేసుకుంటోంది. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున సూర్యకిరణాలు నేరుగా స్వామి పాదాలను తాకాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అన్నదానం నిర్వహించారు.

పొలంలో పైప్‌లైన్ ధ్వంసం

పుట్లూరు: మండలంలోని గరుగుచింతలపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త వెంకటశివుడుకు చెందిన పొలంలో పైప్‌లైన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం ఉదయం ధ్వంసం చేశారు. బోరు బావి నుంచి పొలానికి నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసుకున్న పైప్‌లైన్ సెక్షన్‌ను దుండగులు ధ్వంసం చేసినట్లు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని సీఐ సుబ్రహ్మణ్యం పరిశీలించారు.

దళిత సర్పంచ్‌పై టీడీపీ నేతల దాడి



చికిత్స పొందుతున్న సర్పంచ్ వెంకటేశులు

రాయదుర్గం రూరల్: మండలంలోని చదం గ్రామ దళిత సర్పంచ్ వెంకటేశులుపై సోమవారం టీడీపీకి చెందిన అగ్రవర్ణాల వారు దాడికి పాల్పడ్డారు. సంబంధం లేని పొలం గట్టు విషయంలో కావాలనే గొడవకు దిగి దాడి చేసినట్లు బాధితుడు తెలిపాడు. తన పొలంలోని గట్టు సరిహద్దులను సోమవారం ఉదయం జేసీబీతో సరి చేస్తున్నప్పుడు పక్కనే రాయదుర్గానికి చెందిన వారి పొలాన్ని కౌలుకు చేస్తున్న టీడీపీ నాయకులు దేవేంద్ర రెడ్డి, సంతోష్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, మోహన్ రెడ్డి మూకుమ్మడిగా వచ్చి అడ్డుకున్నారన్నారు. దుర్భాషలాడుతూ కాళ్లు, చేతులతో విచక్షణారహితంగా కొట్టారన్నారు. కొడవలితో ఆనందరెడ్డి దాడి చేయడానికి ప్రయత్నిస్తుండగా తప్పించుకున్నట్లుగా వివరించారు. ఈ లోపు పరిసరాల్లో ఉన్న వెంకటేశులు, పరుశురాముడు, జేసీబీ ఆపరేటర్ రాజశేఖర్ తనను కాపాడి గ్రామస్తుల సహకారంతో ఆస్పత్రికి చేర్చినట్లు పేర్కొన్నారు. గతంలోనూ తనపై పలుమార్లు వారు దాడి చేశారని, వారి నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

ప్రశాంతి నిలయంలో హోలీ సందడి



ప్రేమ్ భక్తి పర్వ్ నాటికలోని ఘట్టం

ప్రశాంతి నిలయం: హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రశాంతి నిలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయికుల్వంత్ హాలులో బిహార్ భక్తులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిహార్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన బాలవికాస్ విద్యార్థులు 'ప్రేమ్ భక్తి పర్వ్' పేరుతో ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది. సత్యసాయి ప్రేమ ఆధ్యాత్మిక తత్వం ద్వారా భక్తులు తరిస్తున్న తీరును చక్కగా వివరించారు. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ఇంటి నుంచే ఓటు!

- పోలింగ్ శాతం పెరిగేలా కేంద్ర ఎన్నికల కమిషన్ చర్యలు
- ఓట్ ఫ్రమ్ హోం విధానం అమలుకు శ్రీకారం
- 85 ఏళ్లు నిండిన వారు, దివ్యాంగులకు అవకాశం

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కేంద్ర ఎన్నికల సంఘం కొత్త పద్ధతిని అమల్లోకి తెచ్చింది. వయోవృద్ధుల్ని, దివ్యాంగులను గౌరవిస్తూ ఇంటినుంచే ఓటు హక్కు వినియోగించుకునే సౌకర్యాన్ని కల్పించింది. ఇటీవల ఎన్నికల షెడ్యూల్ విడుదల సందర్భంగా ఓట్ ఫ్రమ్ హోం విధానాన్ని కేంద్ర ఎన్నికల కమిషన్ వెల్లడించింది. అసలు ఇంటి నుంచి ఎలా ఓటు వేయాలి? ఇంటి నుంచి ఓటు వేసేందుకు అర్హత ఏమిటి? ఎలా దరఖాస్తు చేసుకోవాలి? అనే అంశాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.



హిందూపురం అర్బన్: ఓటు వేయాలని ఉన్నా వయోభారంతో ఇల్లు కదల్లేని వారికి, దివ్యాంగులకు కేంద్ర ఎన్నికల కమిషన్ సువర్ణ అవకాశాన్ని కల్పించింది. ఇంటి వద్ద నుంచే వీరు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంది. ఈ సార్వత్రిక ఎన్నికల నుంచే ఓట్ ఫ్రమ్ హోం పద్ధతిని అందుబాటులోకి తీసుకురావడంతో ఈ సారి ఓటింగ్ శాతం భారీగా పెరిగే అవకాశం ఉంది.

ఎవరు అర్హులంటే..

మొత్తం 7 దశల్లో లోక్‌సభతో పాటు 4 రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించేలా షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఓట్ ఫ్రమ్ హోం కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు అర్హతలు, ఇతర నిబంధనలు, మార్గదర్శకాలను కేంద్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యమున్న దివ్యాంగ ఓటర్లను అర్హులుగా ప్రకటించింది. వీరికి పోస్టల్ బ్యాలెట్‌లను మంజూరు చేయనున్నారు. దివ్యాంగులు తప్పనిసరిగా సదరమ్ సర్టిఫికెట్‌ను చూపాల్సి ఉంటుంది. నామినేషన్ల పర్వానికి ముందే అర్హుల ఇంటి వద్దకు అధికారులు వచ్చి దరఖాస్తులను అందజేస్తారు. వీటిని భర్తీ చేసి ఐదు రోజుల్లోపు బీఎల్‌ఓలకు అందజేయాలి. అనంతరం బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారి ఇంటికి వెళ్లి పరిశీలిస్తారు. వారు ఓట్ ఫ్రమ్ హోం వేసుందుకు అర్హులే అనే విషయాన్ని నిర్ధారిస్తారు. ఆ తర్వాత అర్హులు సమర్పించిన ఫారం 12డీని రిటర్నింగ్ అధికారికి అందిస్తారు. ఓట్ ఫ్రమ్ హోం కోసం దరఖాస్తు చేసుకున్నవారి పూర్తి అడ్రస్, ఫోన్ నంబర్ను ఎన్నికల సంఘం వెబ్ సైట్‌లో ఉంచుతారు.

ఒక్క రోజు ముందే ఓటు వినియోగం

ఇంటి వద్దనే ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు, వయోవృద్ధులు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు వీలుగా ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తుంది. ఫారం-12డి ద్వారా దరఖాస్తు చేసుకున్న ఓటరు ఇంటికి ఎన్నికల సిబ్బంది మొబైల్ వాహనంలో చేరుకుని ఓటరుకు పోస్టల్ బ్యాలెట్ అందజేస్తారు. అధికారులు నిర్దేశించిన చోట ఓటరు రహస్యంగా తన ఓటు వేసి బ్యాలెట్ బాక్సులో వేయాల్సి ఉంటుంది. ఇద్దరు పోలింగ్ అధికారులు, పోలీసు అధికారితో పాటు ఓ వీడియో గ్రాఫర్ సమక్షంలో ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఓటరు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే ప్రక్రియనంతా వీడియోగ్రఫీ చేయనున్నారు. ఈ ప్రక్రియను ఎన్నికలకు ఒకరోజు ముందుగానే పూర్తి చేస్తారు.

ఉమ్మడి జిల్లాలో ఇది లెక్క..

శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని ఆరు నియోజకవర్గాల్లో మొత్తం 13,91,628 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 10,300 మంది దివ్యాంగులు, 9వేల మందికి పైగా 85 ఏళ్లపై బడిన వారు ఉన్నారు. అలాగే అనంతపురం జిల్లా పరిధిలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 19,98,841 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 9,99,463 మంది, మహిళ ఓటర్లు 10,10,137 మంది, ఎన్ఆర్ఐ ఓటర్లు 121 మంది, దివ్యాంగ ఓటర్లు 25,993 మంది, 85 ఏళ్ల పైబడి వయసున్న ఓటర్లు 9,799 మంది ఉన్నారు. వీరిలో అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకుంటే ఓట్ ఫ్రమ్ హోం సౌకర్యాన్ని కల్పించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

మందకృష్ణకు మందబుద్ధి

- సొంత ప్రయోజనాల కోసమే చంద్రబాబు కాళ్ల వద్ద దళితుల ఆత్మగౌరవం తాకట్టు
- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్నోబులేసు ధ్వజం

అనంతపురం కార్పొరేషన్: మందకృష్ణ మాదిగలోని మంద బుద్ధి ఏ మాత్రం మారలేదని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్నోబులేసు విమర్శించారు. ఇటీవలటీడీపీకి మద్దతుగా చంద్రబాబును మంద కృష్ణ కలవడాన్ని తప్పుబడుతూ సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉద్యమాల పేరుతో దళిత యువతను పొట్టన పెట్టుకున్న మందకృష్ణ మాదిగను దళితులు ఏనాడో దూరం పెట్టారన్నారు. దళితుల్లో ఎవరైనా పుడుతారా? అంటూ నీచంగా మాట్లాడిన మాజీ సీఎం చంద్రబాబుతో మందకృష్ణ కలసి మరోసారి దళితులను నయవంచనకు గురి చేశారన్నారు. ఏనాడూ దళితుల ప్రయోజనాల గురించి ఆలోచించని మంద కృష్ణ.... నేడు తన స్వప్రయోజనాల కోసం దళితుల ఆత్మగౌరవాన్ని చంద్రబాబు కాళ్ల వద్ద తాకట్టు పెట్టారని మండిపడ్డారు. జాతి అభ్యున్నతి కోసం బీజేపీతో కలవడం జరిగిందని చెప్పుకుంటున్న మంద కృష్ణ మాదిగ... ఎస్సీ రిజర్వేషన్‌పై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల ద్వారా దళితులు ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారన్నారు. మందకృష్ణ మాదిగ టీడీపీకి మద్దతుగా నిలిచినా ఎలాంటి ప్రయోజనం ఉండబోదన్నారు. చంద్రబాబు, మందకృష్ణ మాదిగ చేసిన నీచ రాజకీయాలు దళితులు ఎన్నటికీ మరిచిపోలేరన్నారు.

రమణీయం... రథోత్సవం



కొండపై మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరులో కొండపై వెలసిన మలహోబిల లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఉదయాన్నే గ్రామస్తులు, భక్తులు ఆధ్వర్యంలో రథాన్ని కొంత మేర లాగారు. అనంతరం సాయంత్రం వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణలో రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పరుష నిర్వహించనున్నట్లు ఆలయ సిబ్బంది తెలిపారు.

ఆసీఫ్ నుంచి ప్రాణహాని ఉంది... కాపాడండి

- ఎస్పీ కార్యాలయం ఎదుట హిజ్రాల ఆందోళన



ఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న హిజ్రాలు

అనంతపురం: నగరంలోని ఆసీఫ్ అనే వ్యక్తి నుంచి తమకు ప్రాణహాని ఉందని, వెంటనే చర్యలు తీసుకుని అతని బారి నుంచి తమను కాపాడాలంటూ ఎస్పీ కార్యాలయం ఎదుట పలువురు హిజ్రాలు సోమవారం ఆందోళన చేపట్టారు. రోజూ తనకు డబ్బు ఇవ్వాలని, లేదంటే భౌతికదాడులు తెగబడుతున్నాడని ఆరోపించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఆసీఫ్ ఫోన్‌పే, గూగుల్ పే అకౌంట్లకు తాము పంపిన డబ్బు వివరాలను మీడియాకు చూపించారు. న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్‌కు వెళితే ఓ సీఐ దుర్భాషలాడుతున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. ఆందోళన చేస్తున్న హిజ్రాలను అనంతపుర డీఎస్పీ వీర రాఘవరెడ్డి పిలిపించుకుని మాట్లాడారు.

ఉపాధి కల్పించే దిశగా చర్యలు

హిజ్రాలకు సమాజంలో గౌరవం దక్కేలా ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని అనంతపురం డీఎస్పీ వీరరాఘవ రెడ్డి భరోసానిచ్చారు. కలెక్టర్, స్వచ్ఛంద సంస్థలను సంప్రదించి వారికి ఉపాధి కల్పించేలా చొరవ తీసుకుంటామన్నారు. సోమవారం హిజ్రాలతో చర్చించిన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నగరంలోని బద్రీ, ఆసీఫ్ గ్రూపుల మధ్య విభేదాలు ఉన్నాయన్నారు. గతంలో ఆసీఫ్ గ్రూపు మీద ఫిర్యాదు వస్తే నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్ పంపినట్లుగా గుర్తు చేశారు. ఈ క్రమంలో రోజు విడిచి రోజు గ్రూపుల వారీ భిక్షాటనకు అనుమతించాలని కోరడంతో నిరాకరించినట్లు పేర్కొన్నారు. నగరంలోని రెవెన్యూ కాలనీ, బస్టాండ్ పరిసరాల వద్ద హిజ్రాల సంచారాన్ని కట్టడి చేస్తామన్నారు. భిక్షాటన, వ్యభిచారం చేయడానికి అనుమతి కావాలని కోరితే ఎలాంటి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. భిక్షాటనలో స్వచ్ఛందంగా ఎవరైనా డబ్బులిస్తే తీసుకోవాలని, బలవంతం చేసినట్లుగా తెలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వీరి దౌర్జన్యాలకు భయపడి డబ్బు ఎవరూ ఇవ్వకూడదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రాణం ఉన్నంత వరకూ జగన్ వెంటే

- రాయదుర్గం 24వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు
- ఇఫ్తార్‌కు వచ్చిన వారికి కండువా వేసి 'కాలవ' సిగ్గు లేని రాజకీయం



మెట్టు గోవిందరెడ్డితో మైనారిటీ నాయకులు

రాయదుర్గం టౌన్: తాము జీవించి ఉన్నంత కాలమూ సీఎం వైఎస్ జగన్ వెంటే నడుస్తామని రాయదుర్గంలోని 24వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. వార్డులో ఇఫ్తార్ విందుకు హాజరైన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత అల్లాబకాష్‌కు ఇష్టం లేకపోయినా మాజీ మంత్రి, టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు పార్టీ కండువా వేసి 30 కుటుంబాలు టీడీపీలో చేరినట్లు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. సోమవారం 24వ వార్డు కౌన్సిలర్ షబ్బీర్ ఆధ్వర్యంలో అల్లాబకాష్ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డిని కలసి జరిగిన విషయాన్ని వివరించాడు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అల్లాబకాష్ మాట్లాడారు. ముస్లిం మైనారిటీలకు మంచి జరిగింది కేవలం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనేనని అన్నారు. ముస్లిం మైనారిటీల మద్దతు వైఎస్సార్‌సీపీకే ఉంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో రాయదుర్గంలో వైఎస్సార్ సీపీని అఖండ మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ... ఎన్ని గిమ్మిక్కులు చేసినా రాయదుర్గంలో కాలవ శ్రీనివాసులును ఎవరూ నమ్మబోవడం లేదన్నారు. మరోమారు రాయదుర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మే 13న జరిగే ఎన్నికల తర్వాత టీడీపీ శాశ్వతంగా కనుమరుగుకావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్లు వలిబాషా, శ్రీనివాసయాదవ్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, కౌన్సిలర్లు శ్రీనివాసరెడ్డి, డిష్ గోవిందు, వన్నూరుస్వామి, ఫకృద్దీన్, బండి అజయ్, ప్రతాప్, మంజునాథ, మాజీ కౌన్సిలర్ రఘురాం, నాయకులు పొరాళ్ల శివకుమార్, గురుమాలు శీన, గురుమాలు రాజు, వార్డు ఇన్‌చార్జ్‌లు గోల్డ్ ఇస్మాయిల్, గోనబావి నిజాముద్దీన్, వంశీ, రఫీక్, కొలిమి ఆనంద్, పవన్‌కుమార్, అబుబకర్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రాప్తాడు: జిల్లాలోకి అక్రమంగా తీసుకువస్తున్న 13 బాక్సుల కర్ణాటక మద్యాన్ని సోమవారం ఉదయం రాప్తాడు పోలీసులు పట్టుకున్నారు. వివరాలను రాప్తాడు పోలీసుస్టేషన్‌లో సీఐ మునిస్వామితో కలసి డీఎస్పీ బి.వెంకట శివారెడ్డి వెల్లడించారు. శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం పేరూరు గ్రామానికి చెందిన రాకేష్, గుడసాల మనోహర్, జి.మహేష్ సోమవారం ఉదయం కర్ణాటక నుంచి బొలెరో వాహనంలో 13 బాక్సుల్లో 1,248 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని తీసుకుని రాప్తాడు మండలం పాలచెర్లలో విక్రయించేందుకు బయలుదేరారు. సమాచారం అందుకున్న రాప్తాడు పోలీసులు డీఎస్పీ బీవీ శివారెడ్డి, సీఐ మునిస్వామి నేతృత్వంలో బృందాలుగా విడిపోయి తనిఖీలు చేపట్టి బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. రూ.87,360 విలువ చేసే కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేశారు. రాకేష్, మనోహర్, మహేష్‌ను అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచారు.

వలంటీర్లకు బేషరతుగా క్షమాపణ చెప్పండి

- టీడీపీ నేతలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హితవు



తాడిపత్రి రూరల్: వలంటీర్లపై నీచమైన వ్యాఖ్యలు చేసినందుకు బేషరత్తుగా వారికి క్షమాపణ చెప్పాలని టీడీపీ నాయకులకు తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హితవు పలికారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వలంటీర్ల సేవలను చూసిన చంద్రబాబు, ఆయన అనుచరుల గుండెల్లో రైళ్లు పరుగుతీస్తున్నాయన్నారు. దీంతో ఓటమి భయంతో చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు వలంటీర్ల వ్యవస్థను కించపరిచేలా మాట్లాడుతున్నారన్నారు. టీడీపీ కార్యకర్తల జేబులు నిండడం లేదన్న అక్కసుతో వలంటీర్లను ఉగ్రవాదులు, జిహాదీలు, స్లీపర్‌సెల్స్‌తో పోల్చుతూ నీచంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేవలం గౌరవవేతనంతో వలంటీర్లు నిస్వార్థ సేవలు అందిస్తున్నారన్నారు. కోవిడ్ సమయంలో టీడీపీ నేతలు ప్రజలకు దూరంగా ఉంటే... వలంటీర్లు మాత్రం ప్రాణాలకు తెగించి గడప గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలతో పాటు వైద్య సేవలను అందజేశారని గుర్తు చేశారు. వలంటీర్ల సేవలను దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు కొనియాడుతుంటే టీడీపీ నాయకులు మాత్రం ఆరోపణలు చేస్తుండడం వారి నీచ రాజకీయానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా వలంటీర్లకు క్షమాపణ చెప్పకపోతే భవిష్యత్తులో చంద్రబాబు, ఆయన బృందం ఉనికి కోల్పోవడం ఖాయమన్నారు.

అల్లుడికి జైలు శిక్ష

పుట్టపర్తి: మామపై దాడి చేసిన కేసులో అల్లుడికి జైలు శిక్ష విధిస్తూ పుట్టపర్తి న్యాయస్థానం తీర్పు వెలువరించింది. పోలీసులు తెలిపిన మేరకు... బుక్కపట్నం మండలం అగ్రహారం గ్రామానికి చెందిన శీను, వరలక్ష్మి దంపతులు. కుటుంబ కలహాల నేపథ్యంలో గత ఏడాది వరలక్ష్మి... అదే గ్రామంలోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. గత డిసెంబర్ 28న తన మామ నారాయణ ఇంటికెళ్లి కుమార్తెను కాపురానికి పంపాలని శీను కోరాడు. దీనికి నిరాకరించడంతో దాడికి దిగాడు. అడ్డుకోబోయిన వరలక్ష్మితో పాటు ఆమె తల్లి రాములమ్మనూ గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి, నిందితుడిని పుట్టపర్తి కోర్టులో హాజరు పరిచారు. ఏడుగురు సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో శీనుకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించారు.

క్లుప్తంగా

ఘనంగా అయ్యప్ప జన్మనక్షత్ర వేడుకలు



పూజలు చేస్తున్న అర్చకులు

అనంతపురం కల్చరల్: పాతూరు చెరువుకట్టపై ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం అయ్యప్ప స్వామి జన్మనక్షత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు మణికంఠ గౌతమ్ ఆధ్వర్యంలో అర్చకులు కలశ పూజలు, పవిత్ర జలాలతో అభిషేకాలు చేపట్టారు. అంతకు ముందు అయ్యప్పను సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నాగలింగారెడ్డి, నాగానందం, గజేంద్ర మోహన్, రాము, కేశవ, గురుస్వామి జీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాల్గుణ పౌర్ణమి



హోమం నిర్వహిస్తున్న పండితులు, ట్రస్టు ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: పాల్గుణ మాసంలో వచ్చిన పౌర్ణిమ వేడుకలు నగరంలో పలు ఆలయాల్లో ఘనంగా జరిగాయి. సోమవారం స్థానిక సోమనాథ్ నగర్‌లోని కోదండ రామాలయంలో సాయిట్రస్టు ఆధ్వర్యంలో గాయత్రి పంచాయతన మండల పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే గణపతి హోమం, రుద్రహోమం, పురుష సూక్తం, నారాయణ హోమం, చండీ హోమాలను పండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున ప్రసాద వితరణ జరిగింది. సాయిట్రస్టు విజయ్‌కుమార్, నాయక్, మణూరు నాగరాజు, రాఘవేంద్ర గుప్తా తదితరులు వివిధ హోమాలను జరిపించారు.

రూ.66 లక్షలకుపైగా పన్ను వసూలు



అదనపు కమిషనర్ శ్రీహరిబాబుకు రూ.13 లక్షల చెక్కు ఇస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని వివిధ డివిజన్లకు సంబంధించి సోమవారం రూ.66,89,263 పన్ను వసూలైంది. సెలవు రోజున కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో అదనపు కమిషనర్ శ్రీహరిబాబు పర్యవేక్షణలో ఆర్‌ఓలు సతీష్, సుజాత, ఆర్‌ఐలు మురళీ, వేణు, పద్మావతి, బాబులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. కమలానగర్‌లో ఓ షాపింగ్ కాంప్లెక్స్ నిర్వాహకుడు రూ.13 లక్షలు, మరో షాపింగ్ కాంప్లెక్స్ నిర్వాహకుడు రూ.8 లక్షలు ఒకేసారి చెల్లించారు. పన్ను చెల్లింపులకు ఈ నెలాఖరు వరకూ మాత్రమే గడువు ఉందని అదనపు కమిషనర్ శ్రీహరిబాబు పేర్కొన్నారు. నగర ప్రజలు వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

తలుపుతట్టి పింఛన్ అందించాం

- గతంలో పింఛన్లు టీడీపీ సానుభూతిపరులకే అందాయి
- సీఎం జగన్ పాలనలో మధ్యవర్తులు లేకుండా పథకాల సొమ్ము నేరుగా ఖాతాల్లోకి జమ
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 1, 4వ డివిజన్లలో కొనసాగిన 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: 'గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం నగరపాలక సంస్థ, ప్రభుత్వ స్కూళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేసే దయనీయమైన పరిస్థితులు ఉండేవి. అప్పటి ఇబ్బందికర పరిస్థితులను మీరే కళ్లారా చూశారు. అయితే వైఎస్సార్‌సీపీ పాలనలో పరిస్థితి మారింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ఉదయం 5 గంటల నుంచే తలుపు తట్టి పింఛన్ అందిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని 1, 4 డివిజన్లలో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం జరిగింది. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి కరపత్రాలను స్థానిక ప్రజలకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి నెలా రెండు మూడు రోజుల్లోనే లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. సుదూర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నా.. వలంటీర్లు ఆస్పత్రి వద్దకే వెళ్లి పింఛన్ అందిస్తున్నారన్నారు. పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో ఏదైనా సంక్షేమం అందాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల ఆశీస్సులుండాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. తమ ప్రభుత్వంలో దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే వివిధ సంక్షేమ పథకాల సొమ్ము జమ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు.

నేడు 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 4వ డివిజన్‌లో మంగళవారం ఉదయం 7 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని రామచంద్ర నగర్‌లోని రామాలయం నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ఇంటి వద్దకే పాలన..

గతంలో ఏదైనా సర్టిఫికెట్ పొందాలంటే తహసీల్దార్ కార్యాలయం చుట్టూ, ఇతర సర్టిఫికెట్లకు ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే పరిస్థితి ఉండేదన్నారు. విజన్ కల్గిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రతి డివిజన్ పరిధిలో రెండు, మూడు సచివాలయాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారన్నారు. అనంతపురం నగరంలో 74 సచివాలయాలను ఏర్పాటు చేసి, ఇంటి వద్దకే సంక్షేమం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సచివాయాల్లోనే పనులు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలైనా ఈ స్థాయిలో సేవలందించాయో లేదో ఆలోచించాలన్నారు. వీటితో పాటు ప్రాధాన్యత క్రమంలో నగరంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. టవర్‌క్లాక్ ఓవర్ బ్రిడ్జ్ జిల్లా కేంద్రానికే తలమానికంగా మారిందన్నారు. నిర్దేశిత సమయం కంటే ముందు బ్రిడ్జ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటితో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లు, కాలువలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, ఆర్టీసీ రీజినల్ బోర్డు చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వర్థనాయక్, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణ, కార్పొరేటర్లు చంద్ర, లాలు, అనిల్‌కుమార్ రెడ్డి, కమల్‌భూషణ్, బాలాంజినేయులు, సంపంగి రామాంజనేయులు, జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతా సోమశేఖర్ రెడ్డి, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు సైఫుల్లాబేగ్, ఉమ్మడి మదన్ మోహన్‌రెడ్డి, శ్రీదేవి, కృష్ణవేణి, నాయకుడు బసవరాజు, స్థానికులు హనుమంతు, ఎస్.ఇర్షాద్, ఎస్ కాలేషా, రాజ్‌కుమార్, జోగి రాజేంద్ర, మురళీ, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, రామయ్య, అనిల్‌కుమార్ గౌడ్, అమర్‌నాథ్ రెడ్డి, జావెద్, జానీ, తానీషా, చెన్నారెడ్డి, భారతి, ఉష, సుజాతరెడ్డి, సుహాసిని, పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరైన నలుగురికి మెమోలు

అనంతపురం కార్పొరేషన్: పన్ను వసూళ్లకు సంబంధించి క్షేత్రస్థాయిలో విధులకు గైర్హాజరైన నలుగురు సిబ్బందికి అదనపు కమిషనర్ శ్రీహరిబాబు సోమవారం మెమో జారీ చేశారు. ఇంటి, నీటి పన్ను చెల్లింపులపై రెవెన్యూ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టిన విషయం విధితమే. 2వ సచివాలయం అడ్మిన్ సి.నారాయణ స్వామి, 23వ సచివాలయం అడ్మిన్ జి.శివకృష్ణ, 31వ సచివాలయం అడ్మిన్ బి.ముత్యాలయ్య, 63వ సచివాలయం అడ్మిన్ సి.గురుబ్రహ్మ విధులకు గైర్హాజరు కావడంతో అదనపు కమిషనర్ మెమో జారీ చేశారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రామగిరి: మండలంలోని ఎగువపల్లి కర్ణాటక సరిహద్దులోని చెక్‌పోస్ట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం సాయంత్రం చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. కనగానపల్లి మండలం మద్దలచెరువు గ్రామానికి చెందిన ముత్యాలన్న ద్విచక్ర వాహనంలో 200 టెట్రాప్యాకెట్లను తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అనంతపురం: షికారి కొట్టాలకు చెందిన షికారీ భగవాన్ నుంచి 29 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం, 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ వి.రెడ్డప్ప తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలి

అనంతపురం కల్చరల్: ముస్లిం, మైనార్టీల అభివృద్ధికి పాటుపడే వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని మేయర్ వసీం పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి స్థానిక గుత్తిరోడ్డు ఆక్సా ఏ మసీదులో జరిగిన జోహర్ నమాజ్ అనంతరం మసీదు వెలుపల వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన మేయర్ వసీం, మార్కెట్‌యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైఫుల్లా బేగ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ తదితరులు మాట్లాడారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మరోసారి మైనార్టీల గురించి ఆలోచించే వారిని గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం సాధ్యమన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మైనార్టీల సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ప్రజల కోసం పరితపించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ముస్లింలకు నేరుగా పదవులివ్వడమే కాకుండా నామినేటెడ్ పోస్టుల్లో రాజకీయంగా ఎదగడానికి సముచిన స్థానాలను కల్పించి న్యాయం చేశారన్నారు. ఐదేళ్లగా అందించిన అభివృద్ధి, పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాషా, హబీబుల్లా జావీద్ తదితరులు పాల్గొన్నారు.



గుత్తి రోడ్డులో ప్రచారం చేస్తున్న మేయర్ వసీం, తదితరులు

వృద్ధురాలికి ఆర్థికసాయం

అనంతపురం కల్చరల్: ఓ వృద్ధురాలి ఆపరేషన్‌కు అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి ఆర్థికసాయం అందజేసి అండగా నిలిచారు. నగరానికి చెందిన 60 ఏళ్ల హౌరాసింగ్, భార్య లక్ష్మీబాయి, కొడుకు చేతన్‌సింగ్‌తో కలిసి జిలేబీలు, సమోసాలు అమ్ముకుంటూ జీవిస్తున్నారు. ఇటీవల కాలే నూనె పడటంతో లక్ష్మీబాయి తప్పించుకోవడానికి ప్రయత్నించి కిందపడింది. వెన్నెముక, కాలికి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిపాలైంది. ఆపరేషన్‌కు రూ.2.50 లక్షల ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. అయితే అంత డబ్బు వారి వద్ద లేకపోవడంతో దాతల కోసం ఎదురు చూశారు. విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణసాయంగా రూ.1.50 లక్షలు అందజేశారు. మిగతా సొమ్ము తోటి రాజస్థానీ వ్యాపారులందించారని తెలిపారు. ఆపరేషన్ తర్వాత మందులను సైతం అందిస్తానని రమణారెడ్డి హామీ ఇచ్చారు. అలాగే లక్ష్మీబాయిని బెంగళూరులోని గౌరీ గోపాల్ ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అంబులెన్సు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.



ఆర్థికసాయం అందజేస్తున్న అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి

కనులపండువగా చింతల వేంకటరమణుడి కల్యాణం



అలంకరణలో వేంకటరమణ స్వామి, ఆనందవల్లి నాయికి

తాడిపత్రి: పట్టణంలోని చింతల వేంకట రమణ స్వామి ఆలయంలో కల్యాణోత్సవం సోమవారం కనుల పండువగా నిర్వహించారు. చింతల వేంకట రమణ స్వామి సతీమణి ఆనందవల్లి నాయకి అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకుని అర్చకులు భక్తుల సమక్షంలో కల్యాణోత్సవం జరిపించారు. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు కందిగోపుల మురళీ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించారు.

వైభవంగా చెన్నకేశవ స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గుత్తి రూరల్: మండలంలోని చెర్లోపల్లి పంచాయతీ సేవాగఢ్ సమీపంలో కొండపై ఉన్న ఆలయంలో సోమవారం చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో వేకువజాము నుంచి అర్చకులు మారుతీ ప్రసాద్, శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కల్యాణాన్ని జరిపించారు. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం రథోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. మూడు రోజులు పాటు జరిగే చెన్నకేశవ స్వామి ఉత్సవాలు మంగళవారం ముగుస్తాయని అర్చకులు తెలిపారు.


ఆకుతోటపల్లిలో ఇంటింటా ప్రచారం

రాప్తాడురూరల్: హిందూపురం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని బోయ శాంతమ్మ, రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. సోమవారం అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేశారని గుర్తు చేశారు. పథకాల పేరుతో ఒక్కో ఇంటికి లక్షలాది రూపాయలు బ్యాంకు ఖాతాల్లో జమ చేశారని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకుంటే సంక్షేమ పథకాలు ఇలానే కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్ రెడ్డి, యువజన విభాగం మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, సర్పంచ్ గురు ప్రసాద్, ఎంపీటీసీలు సునీల్ దత్త రెడ్డి, సోముశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఆనంద్, సర్పంచులు కృష్ణారెడ్డి, భాస్కర్ రెడ్డి, కృష్ణయ్య, ఇటుకలపల్లి చిరంజీవి, ఆలమూరు ఓబులేసు, ఐటీ వింగ్ సుబ్బు రాయల్, ఆకుతోటపల్లి గ్రామ నాయకులు కుమ్మరి నరేష్, బీరక మనోహర్, సత్తిరెడ్డి, చెన్నా రెడ్డి, నిరంజన్ రెడ్డి, నాగార్జున, వెంకటరామిరెడ్డి, నాగభూషణ్, శంకర్ రెడ్డి, ఎస్కేయూ లింగారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.



ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుండెపోటుతో బాలాజీ విద్యా మందిరం అధినేత మృతి



కనేగంటి రామిరెడ్డి (ఫైల్)

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) చీఫ్ కో-ఆర్డినేటర్, స్థానిక రుద్రంపేటలోని బాలాజీ విద్యా మందిరం అధినేత కనేగంటి రామిరెడ్డి (49) సోమవారం సాయంత్రం గుండెపోటుతో కన్నుమూశారు. ప్రైవేట్ పాఠశాలల యజమానులు తెలిపిన వివరాలు.. సాయంత్రం కమలానగర్‌లోని అపుస్మా కార్యాలయంలో ఏర్పాటు చేసిన అసోసియేషన్ అత్యవసర సమావేశానికి రామిరెడ్డి హాజరయ్యారు. సమావేశం ప్రారంభం కాకముందే తనకు గుండెవద్ద నొప్పిగా ఉందని ఇంటికి వెళ్లి విశ్రాంతి తీసుకుంటానని తోటి సభ్యులకు చెప్పి బయలుదేరి వెళ్లారు. 6:30 గంటలకు ఇంటికి చేరుకోగానే కుప్పకూలి పోయారు. కుటుంబ సభ్యులు ఆయన్ను హుటాహుటిన నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి రుద్రంపేటలోని నివాసానికి చేరుకుని రామిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రైవేట్ పాఠశాలల యాజమానులు, స్నేహితులు పెద్ద ఎత్తున రామిరెడ్డి ఇంటి వద్దకు చేరుకుని సంతాపం తెలిపారు. కాగా రామిరెడ్డి భార్య పార్వతి కళ్యాణదుర్గంలో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

సెలవు పాటించాలి: అపుస్మా

కనేగంటి రామిరెడ్డి అసోసియేషన్‌లో చాలా చురుకుగా ఉంటూ.. ప్రైవేట్ పాఠశాలల యాజమానులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశారని అపుస్మా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుసుమ పుల్లారెడ్డి, గాజుల చంద్ర తెలిపారు. సంఘంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. రామిరెడ్డి అకాల మరణానికి సంతాపంగా మంగళవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రైవేట్ పాఠశాలలు సెలవు దినం పాటించాలన్నారు.



స్నేహితులపై వాటర్ గన్‌తో రంగులు చిమ్ముతున్న బాలురు



నీరు చల్లుతున్న దృశ్యం

రంగుల హేల.. హోలీ



రంగులు పూసుకుంటున్న చిన్నారులు

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం హోలీ పండుగను ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. కుర్లపల్లి తాండా, ముత్తువకుంట, మద్దెలచెరువు, కేకే, పీకే తాండాల్లో గిరిజనులు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పిల్లలు, యువకులు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.

రాప్తాడు: రాప్తాడులో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నారులు, యువత వీధుల్లో చిందులు వేస్తూ రంగునీళ్లు చల్లుకున్నారు. రంగులు పులుముకున్న ముఖాలతో ఎదురు పడిన వారందరిపై రంగులు చల్లారు. అలాగే మండలంలో 16 గ్రామాల్లో హోలీ జరుపుకున్నారు. యువకులు రంగులు చల్లుతూ ద్విచక్ర వాహనాలపై సందడి చేశారు.



హోలీ సంబరాల్లో బాలికలు



ఆనందంతో కేరింతలు కొడుతున్న దృశ్యం



నీటిలో తడిసిముద్దయిన బాలురు

ఎన్‌సీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాగేంద్ర ప్రసాద్

అనంతపురం కల్చరల్: ఏపీ ఎన్‌సీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లాకు చెందిన టి.నాగేంద్రప్రసాద్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ మేరకు విజయవాడలో జరిగిన రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశంలో జోనల్ అధ్యక్ష కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా శంకర్, బి.శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బషీర్ అహ్మద్, ఉమెన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా సరస్వతి, జాయింట్ సెక్రటరీగా గుణశేఖర్, శ్రీకాంత్, ఈసీ మెంబర్లుగా వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్ తదితరులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

ఐదుగురి సస్పెన్షన్

అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించిన వలంటీర్లు, కాంట్రాక్టు ఉద్యోగులపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.గౌతమి చర్యలు తీసుకున్నారు. ముగ్గురు వలంటీర్లు, ఇద్దరు కాంట్రాక్టు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

యువకుడికి గాయాలు

గుత్తి: రోడ్డు ప్రమాదంలో రాజు అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. గుత్తి ఆర్‌ఎస్‌కు చెందిన అతడు స్నేహితుడితో కలసి సోమవారం బైక్‌లో గుత్తి నుంచి ఆర్‌ఎస్‌కు వెళుతుండగా మన్రో సత్రం వద్ద ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొన్నాడు. ప్రమాదంలో రాజు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రైల్వే ఉద్యోగికి గాయాలు

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని నెహ్రూ పార్క్ వద్ద సోమవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రైల్వే ఉద్యోగి (లోకో పైలట్) మృత్యుంజయ కుమార్ బైక్‌లో ఆర్‌ఎస్ నుంచి గుత్తికి వెళుతుండగా బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం అనంతపురం రెఫర్ చేశారు.

రంగనాథ స్వామి ఆలయ ఈఓగా రాణి

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారిగా రాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆలయానికి గత రెండేళ్లుగా రెగ్యులర్ ఈఓ లేకపోవడంతో ఇన్‌చార్జ్ ఈఓగా దేవదాసు కొనసాగారు. ఇటీవల జరిగిన రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల అనంతరం ప్రభుత్వం రంగనాథ స్వామి ఆలయానికి రెగ్యులర్ ఈఓగా రాణిని నియమించింది.